క్లుప్తంగా...

ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి



మౌలాలి: నూతన పార్లమెంట్ భవనాన్ని ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడంతో ఆదివారం మౌలాలిలో కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంతోనే దేశాభివృద్ధి జరిగిందన్నారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అనిల్, మహేష్, సత్యనారాయణ, రమణ నటరాజ్, అఖిల్, ఉదయ్, ప్రవీణ్, రంజిత్ పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు నివాళి



వీర సావర్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: స్వాతంత్ర్య సమరయోధులు వీర సావర్కర్ జయంతిని బీజేపీ నాచారం అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వీర సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి నవీన్, ఉదయ్, రవికాంత్, రాజిరెడ్డి, దయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కుషాయిగూడ: బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ పుట్టినరోజు సందర్భంగా గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

షెడ్యూల్ కులాల సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



చిలుకానగర్ షెడ్యూల్ కులాల సేవా సంఘం నూతన కమిటీ

ఉప్పల్: చిలుకానగర్ షెడ్యూల్ కులాల సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా కొండ్ర రాములు, ప్రధాన కార్యదర్శిగా పల్లాటి డేవిడ్, కోశాధికారిగా మోగిలిపాక రామ్‌చందర్, ఉప కోశాధికారిగా అల్లిబిల్లి మహేందర్, ఉపాధ్యక్షులుగా మారపాక సాయిలు, పార్నంది నర్సింగరావు, కొంగరి రామచందర్, సంయుక్త కార్యదర్శిగా జేమ్స్ ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

మల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కూమరస్వామి వివరాల ప్రకారం.. జనగాం జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఎం.రాజశేఖర్(28) నాచారం రాంరెడ్డినగర్‌లో అద్దెకు ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కుషాయిగూడ: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు మాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలానగర్‌లో నివసించే కులకచర్ల ధర్మయ్య(53) వాచ్‌మెన్. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన ధర్మయ్య పని మానేశాడు. ఆదివారం ఉదయం మహేశ్‌నగర్‌లోని తేజ వైన్స్ పక్క రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా కారు అతడిని ఢీకొట్టింది. గాయపడ్డ అతడిని 108లో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు తెలిపారు. కారు అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రంలో పటిష్టంగా పోలీస్ వ్యవస్థ

- సీసీ కెమెరాలతో క్రైమ్ రేటు తగ్గుముఖం
- గంటల వ్యవధిలో ఛేదిస్తున్న పోలీసులు
- ఆదర్శ్‌నగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం
- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఉప్పల్ అపురూప కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, కార్పొరేటర్లు

ఉప్పల్: నేర రహిత సమాజానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతోనే నేడు పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. నేను సైతం, కమ్యూనిటీ వ్యవస్థలో భాగంగా ఉప్పల్ ఆదర్శ్‌నగర్ అపూరూప వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన దాదాపు 80 సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్‌రెడ్డి, బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. భద్రత విషయంలో అసోసియేషన్ల చొరవను అభినందించారు. అనంతరం ఏసీపీ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం వస్తే శాంతిభద్రతలతో ముప్పు ఉంటుందన్న వారే ఈ రోజు ముక్కున వేలేసుకుంటున్నారని గుర్తుచేశారు. పోలీస్ వ్యవస్థను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పటిష్టం చేశారన్నారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నామని, నేరం చేసేందుకు వణికి పోతున్నారన్నారు. ఎలాంటి నేరం జరిగినా గంటల వ్యవధిలోనే ఛేదించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందని తెలిపారు. కార్యక్రమంలో అపురూప వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీనివాస్, గోపాల కృష్ణ, శాకమూరి హరీష్, స్వరూప్, శ్రీనిల్, మధు అనిల్ ప్రసన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, లేతాకుల రఘుపతిరెడ్డి, కృష్ణమాచారి, శ్రీనివాస్‌రెడ్డి, గుడి మధుసూదన్‌రెడ్డి, ఏజేహెచ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అభివృద్ధికి కృషి

నియోజవర్గాన్ని డివిజన్ల వారిగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఆదివారం చిలుకానగర్ డివిజన్‌లోని సీతారామ కాలనీ, కళ్యాణపురి తదితర ప్రాంతాలకు నీటి పైప్‌లైన్ పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. పనులు పూర్తియితే దాదాపుగా 10 ఏళ్ల వరకు తాగునీటికి సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జగన్, పండ్ల కిషన్, నారాయణ రెడ్డి, సైనాజ్, అందాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలో ఓఆర్ఆర్ ఫేజ్–2 రెండవ విడత తాగునీరు, హెచ్‌డీపీఈ పైపులైన్ పనులను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ ఆసీఫ్ అలీ, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, శివ, మహేందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రనగర్ కాలనీలో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



గౌతంనగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



హెచ్‌బీకాలనీలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో..

అల్వాల్/గౌతంనగర్: దివంగత నేత నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ నేత జిల్లా శంకర్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌నగర్‌లో టీడీపీ నేత చింతల నరేష్ ముదిరాజ్ నివాసం ఆవరణలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ గౌతంనగర్ డివిజన్ అధ్యక్షులు పితాని సత్యనారాయణ, చింతల అంజమ్మ, నర్సింగ్‌రావు, రియాజ్, అనుష, రాధిక, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అల్వాల్‌లో..

అల్వాల్ సర్కిల్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు టీఎస్ఆర్ కన్వెన్షన్ అధినేత టి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కౌకూర్‌లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మ శ్రీను, కమ్మ వెంకట్రావు, బొడే శ్రీను, శివరామరాజు, కొత్త రాము, కట్టా సాంబశివరావు, శేఖర్‌గౌడ్, ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ చౌరస్తాలో..

రామంతాపూర్: రామంతాపూర్ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కన్వీనర్ సర్వ సత్తయ్య యాదవ్, లక్ష్మణ్, నర్సింహ, మహబూబ్, సురేష్, ఆదినారాయణ, విజయ, అనసూయమ్మ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీలో..

కుషాయిగూడ: కాకతీయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. కాకతీయ యూత్ క్లబ్ వివిధ పార్టీల నేతలు టీజీకే మూర్తి, సీహెచ్‌వీ సాంబశివరావు, ఎంవీఎస్ ప్రసాద్, అమరకుమార్, వరప్రసాద్, నర్సింహరావు, కార్పొరేటర్ ప్రభుదాస్, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, రాంప్రదీప్, నీరుగొండ సతీష్‌బాబు, సందీప్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జమ్మిగడ్డలో..

టీడీపీ సీనియర్ నేత నీరుగొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ హేమంత్‌కుమార్‌గౌడ్, నాగేశ్వరరావు, పరందామయ్య, వెంకటేష్, శ్రీనివాస్, రాంబాబు, కేఎస్ఎన్ రావు, రమేష్, రవీంద్ర, సారథి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షలు ప్రశాంతం



రామంతాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాల వద్ద అభ్యర్థులు

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం–1, 2, ఆరోర రామంతాపూర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాల, ఒమేఘా డిగ్రీ కళాశాల, ప్రిన్స్‌టన్, మేఘా కళాశాలలు కేంద్రాలుగా పరీక్షలు జరిగాయి.

విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: వెంకటాపురంలోని భూదేవినగర్‌లో విజయ గణపతి ఆలయ 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దంపతులు సబిత కిషోర్, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేదం ఆర్ట్స్ అకాడమీ గురువు వసుమతి వరకల శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. వినాయక కౌతం, దశావతార శబ్దం, జతి స్వరం, బ్రహ్మాంజలి, మహాగణపతిమ్ కీర్తన, ముత్తు స్వామి దీక్షితార్ కీర్తనలను ప్రజ్ఞ, శ్రేయ, యోషిక, ప్రత్యూష, భావన, సంధ్య ప్రదర్శించి మెప్పించారు.

నియామకం



మల్లాపూర్: బీసీ సంక్షేమ సంఘం ఉప్పల్ నియోజకవర్గం పొలిటికల్ ఇన్‌చార్జిగా నాచారం అన్నపూర్ణ కాలనీకి చెందిన బుదాని సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు.

అభినందనలు



అల్వాల్: అల్వాల్‌కు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు ప్రదీప్‌కుమార్‌ను బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ నేత మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. కొంతకాలంగా రాగి ఆకులపై దేవతలు, మహనీయులు తదితర చిత్రాలు రూపొందిస్తున్న ప్రదీప్‌ను ఆయన అభినందించారు.

ఉన్నత ఆలోచనలతో ముందుకెళ్లాలి



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దంపతులు గంగరాజు, విజయకుమారి 22 వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

బీజేపీ గెలుపునకు కృషి చేద్దాం



మచ్చబొల్లారం బీజేపీ అడ్‌హక్ కమిటీని అభినందిస్తున్న సదానంద్‌గౌడ్

అల్వాల్: బీజేపీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం కన్వీనర్ సదానంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం మచ్చబొల్లారం డివిజన్‌లో డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాత కమిటీని రద్దు చేస్తూ నూతన అడ్‌హక్ కమిటీని సదానంద్‌గౌడ్ తాత్కాలికంగా నియమించారు. అడ్‌హక్ కమిటీ సభ్యులుగా ప్రకాశ్ చౌదరి, మల్లికార్జున్ యాదవ్, మహేష్ రాజ్, కరుణశ్రీ, తల్ల వినయ్‌లను నియమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండుగుల వెంకటేష్, వై.గోపి, శివ, మల్లికార్జున్ యాదవ్, వినయ్‌కుమార్, అజయ్ రెడ్డి, కరుణశ్రీ, మహేష్, మాణిక్యరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రాలకు స్పందన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా 24వ డివిజన్‌లో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ ఏంపల్లి అనంతరెడ్డి కలిసి పలు కాలనీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటింటి నుంచి ప్రతిరోజూ చెత్తను క్రమం తప్పకుండా సేకరించాలని కోరారు. మూగజీవాల దాహార్తి తీర్చడం కోసం నగర పరిధిలో ఏర్పాటు చేసిన తాగునీటి తొట్లను పరిశీలించి ఎప్పటికప్పుడు తొట్లలో నీటిని అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు, ప్రజలకు సూచించారు. నగర పరిధిలో స్వచ్ఛ షెహర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సేకరణ కేంద్రాన్ని సందర్శించి ప్రజల నుంచి సేకరించిన వస్తువుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జానకి, మున్సిపల్ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మురుగు సమస్యకు త్వరలోనే చెక్



అశోక్‌నగర్ కాలనీవాసులతో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న తీవ్రమైన మురుగు సమస్యకు త్వరలోనే చెక్ పడనుందని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లో సీసీ రోడ్ల కోసం రూ.40 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసినందుకు కాలనీవాసులు కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి అశోక్‌నగర్‌లో పర్యటించి అశోక్‌నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి ప్రణాళికలు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు బుసాని రఘు, పాండే, తోకల ఆంజనేయులు, మోహన్, ప్రవీణ్, ప్రభాకర్, దత్త ప్రభు, సత్తయ్య, ధన్‌రాజ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి నిర్వహించారు. 2013 సంవత్సరం నుంచి 2022 సంవత్సరం వరకు ఆ పాఠశాలలో టెన్త్ చదివిన విద్యార్థులు 120 మంది పాల్గొనగా పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ బ్యాంక్ యూఎస్ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. చెంగిచర్ల చిన్న క్రాంతి కాలనీలో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల నూతన బ్రాంచీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి 100 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనిల్ అయ్యంగారు, ఉప్పు వరప్రసాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త గోపాల్‌గౌడ్, ప్రిన్సిపాల్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ మేయర్ లక్ష్మీరవిగౌడ్

బోడుప్పల్: బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిస్తోందని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల గాంధీనగర్ కాలనీలో నేషనల్ ఆయుష్ మిషన్, ఆయుష్ గ్రామ్‌లో భాగంగా రామంతాపూర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, వైద్య బృందం గణేష్‌కుమార్, కృష్ణలేఖ, హర్షశ్రీ, రోషిణి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా..



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన విజయ, నాగమణిలను ఆదివారం ఆయన పరామర్శించారు. బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలకు వారికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న పేదలకు బీఎల్ఆర్ ట్రస్టు చేయూతనిస్తోందన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి, తులసి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధపెట్టాలి

పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి



మహిళలకు బహుమతులు అందిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలు మరింత శ్రద్ధ పెట్టాలని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్తీదవాఖానాలో కౌమార బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా కార్పొరేటర్ల సూచనల మేరకు నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు పబ్లిక్ టాయిలెట్స్ తదితర ప్రదేశాల్లో మహిళల కోసం శానిటరీ ప్యాడ్స్ వెండిగ్ మిషన్లను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమాజంలో మార్పు కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను పరిశుభ్రమైన నగరంగా నిలిపేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అవసరమైతే మహిళల కోసం మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు బొడిగే స్వాతి కృష్ణగౌడ్, భైటింటి శారద ఈశ్వర్‌రెడ్డి పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మేడ్చల్ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, కార్పొరేటర్లు, ఏంపల్ల అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, బచ్చ రాజు, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, డాక్టర్ భార్గవి, సీనియర్ నర్సు మోనిక, ఆశా వర్కర్స్, విజయలక్ష్మి, జ్యోతి, షాహిద తదితరులు పాల్గొన్నారు.